తగ్గిన దిగుబడి.. దక్కని మద్దతు ధర


ఆరబెట్టిన పత్తి

- క్వింటాల్ పత్తి రూ. 6,500 మాత్రమే
- రైతుల గోస

కొల్చారం(నర్సాపూర్): పత్తి పండించిన కొల్చారం మండల రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. అసలే భారీ వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గగా, వచ్చిన పంటను అమ్ముకుందామంటే మద్దతు ధర లభించక పత్తి రైతులు లబోదిబోమంటున్నారు. దగ్గర్లో పత్తి కొనుగోలు కేంద్రాలు లేకపోవడం, ఎక్కడ దూరంగా ఉన్న మిల్లులకు తీసుకెళ్లి వారు చెప్పిన రేటుకు అమ్ముకోవడం తప్పించి ఏమి చేయని పరిస్థితి మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. పంట సాగు కోసం కూడా పెట్టుబడి పెట్టిన డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అత్యధికంగా పత్తి సాగు

మండల వ్యాప్తంగా అత్యధికంగా సాగు చేసిన పంట ఏదైనా ఉందంటే అది పత్తి పంటే. మండలంలో ఈసారి 1500 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. పంట ఒక్క దశలో బాగానే ఉన్నప్పటికీ పూత పెట్టిన దశలో భారీ వర్షానికి మొక్క నుంచి పూత రాలిపోవడం, పత్తి కాయ పెరుగుదలపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో మొక్కకు పత్తి కాయలు ఎక్కువగా కాయకపోవడం పంట దిగుబడి తీవ్రంగా తగ్గిపోయింది. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉన్నప్పటికీ అది కాస్త ఐదు నుంచి 8 క్వింటాలకు మాత్రమే పరిమితం అయింది.

కొనుగోళ్లలో ఇబ్బందులు

చేతికొచ్చిన కొద్దిపాటి పంటను మద్దతు ధరకు అమ్ముకుందామన్న మార్కెట్ సౌకర్యం లేదు. దీంతో గ్రామాలకు వచ్చి కొనుగోలు చేపట్టే దళారులు క్వింటాలకు ధర రూ.6500లు తప్పించి ఎక్కువ పెట్టడం లేదు. చెప్పిన రేటుకు అమ్ముకోవాల్సి వస్తుంది. అది కాదంటే 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆందోల్ మండలం ఎకరం ప్రాంతంలో ఉన్నటువంటి స్పిన్నింగ్ మిల్లుకు ప్రైవేట్ వాహనాల్లో వ్యయప్రయాసాల కోర్చి తీసుకెళ్తే రంగు మారిందంటూ, నాణ్యత లేదంటూ ఏదో సాకు చూపెట్టి క్వింటాలుకు అదనంగా రూ.100 పెట్టి కొనుగోలు చేస్తుండడం అవి రవాణా ఖర్చులకే సరిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



మండలంలోని రైతులు కొంతకాలంగా పత్తి పంట సాగు అధికంగా చేపడుతున్నారు. ఈసారి పంట దిగుబడి చాలా తగ్గింది. స్థానికంగా దగ్గర్లో కొనుగోలు కేంద్రాలు లేకపోవడం, దళారులు నిర్ణయించిన రేటుకు అమ్ముకోవడం, తీవ్రంగా నష్టపోతున్నాం. సాగు కోసం చేసిన పెట్టుబడి డబ్బులు కూడా రాని పరిస్థితి ఉంది. కనీస ధర క్వింటాలుకు రూ.7వేలు ఇస్తే కొంత గట్టి ఎక్కుతాం.

– లక్ష్మయ్య, రైతు, పైతర గ్రామం

చాకరిమెట్లలో కార్తీక పూజలు


ఆలయంలో భక్తజనం

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. కార్తీకమాసం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దంపతులు ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించి సత్యనారాయణ మండపంలో సమూహిక వ్రతాలు ఆచరించారు. అనంతరం సీతారామచంద్ర స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, అర్చకులు ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి


పరిశ్రమ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

చేగుంట(తూప్రాన్): పరిశ్రమ అక్రమ లాక్ అవుట్‌ను ఎత్తివేసి కార్మికులకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మక్కరాజీపేట స్ట్రాంటియం పెరీటిన్ పరిశ్రమ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ.. సదరు పరిశ్రమను మక్కరాజీపేటలోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా నడిపించి నాలుగు రోజుల క్రితం మూసివేసినట్లు తెలిపారు. కార్మికుల వేతనాల విషయంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో ఫిర్యాదు ఉండగా కార్యాలయంలో విచారణకు హాజరు కావాల్సిన పరిశ్రమ యజమానులు స్పందించడం లేదన్నారు. కార్మికులకు అన్యాయం చేస్తున్న సదరు పరిశ్రమ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి భాస్కర్, కార్మికులు బాలేష్, యాదగిరి, లక్ష్మణ్, వెంకట్, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

అయ్యప్ప స్వాముల పాదయాత్ర


శబరిమలకు వెళ్తున్న అయ్యప్పస్వాములు

పెద్దశంకరంపేట(మెదక్): మండలం నుంచి కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధానంకు శనివారం బాన్సువాడకు చెందిన వినయ్‌కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో పాదయాత్రగా తరలివెళ్లారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్, నారాయణఖేడ్, పెద్దశంకరంపేటకు చెందిన అయ్యప్ప స్వాములు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దశంకరంపేటకు చెందిన గురుస్వామి రామచంద్రాచారి, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మురళీలు, వారికి ఘనస్వాగతం పలికి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, గురుస్వాములు రాములు, రామ్మూర్తి, శ్రీహరి, సాయిరాం, పరంధాం, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై గుంత


రోడ్డుపై పడిన గుంత వద్ద పెట్టిన కొమ్మలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మనంతయపల్లితండా పాఠశాల వద్ద మెదక్, జోగిపేట ప్రధాన రహదారిపై నడిరోడ్డుపై గుంత పడింది. అయినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని తండావాసులు చెబుతున్నారు. తండాకు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీ కావడంతో రోడ్డుపై గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్న ఇటు గ్రామ పంచాయతీ, అటు ఆర్‌అండ్‌బీ అధికారులు ఎవరు పట్టించుకోవడంలేదని తండావాసులు ఆరోపించారు. దీంతో తండావాసులు గుంత వద్ద కొమ్మలు పెట్టి గుంత కనిపించేలా చేశారు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం


ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమైయ్యాయి. మండలంలోని పోతులబోగూడ నుంచి ఉసిరికపల్లి, చెండి నుంచి అనంతారం చౌరస్తా వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. అందుకు సంబంధించిన నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. సింగిల్‌రోడ్డు ఉండగా డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా డబుల్ రోడ్డు చేసేందుకు చర్యలు చేపట్టారు. రోడ్డు విస్తరణ పూర్తయితే హైదరాబాద్ నగరానికి వెళ్లేందుకు దూరభారం తగ్గడంతో పాటు పలు గ్రామాల ప్రజలకు రవాణా వ్యవస్థ మెరుగుపడనుంది. చాలా ఏళ్ల క్రితం నుంచి పాడైపోయిన రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్‌కు గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్కుల సర్పంచ్ బాలమణి, భర్త నరేందర్‌తో పాటు పిల్లలు గోమారం వైపు బైక్‌పై వస్తుంది. రోడ్డుపై ధాన్యం రాశులు ఆర బోయడంతో ఎదురుగా వచ్చిన మరోబైక్ వీరిని ఢీకొంది. ఈ సంఘటనలో సర్పంచ్‌తో పాటు ఆమె భర్త, కుమారుడికి గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం వారిని నర్సాపూర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో ఉన్న వారిని గాయపడిన బాధిత కుటుంబ సభ్యులను ఎంపీపీ హరికృష్ణ పరామర్శించారు.

రేపు సదానందాశ్రమ వార్షికోత్సవం

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి, లక్ష్మీనగర్, ఆరెపల్లి గ్రామాల శివారులోని శ్రీ సదానందాశ్రమ 40వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆశ్రమ శిష్యబృందం శనివారం తెలిపారు. ధ్వజారోహణం, సామూహిక అభిషేకాలు, పుష్పార్చన, బిల్వపత్ర పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

వైభవంగా శివ పార్వతుల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని గోకర్ణేశ్వర శివాలయం వద్ద శనివారం శివస్వాముల ఆధ్వర్యంలో వేద పండితులు శివ పార్వతిల కల్యాణ మహోత్సవ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివ పార్వతిల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో చూసి ఆనందించారు. అనంతరం భక్తులు తమ కానుకలను ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కల్లేటి అశోక్ గుప్తా అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు, భక్తులు


ఆలయంలో కొలువైన దేవతామూర్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల పరిధిలోని ఉప్పులింగాపూర్ గ్రామ శివారులోని శ్రీ సీతా సమేత అభయ రామచంద్రస్వామి దేవాలయంలో ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు విఘ్నేశ్వర పూజ, స్వస్తి వాచనము, అఖండ దీపస్థాపన, ఋత్విక్కరణ, ఆవాహిత స్థాపిత దేవతాస్థాపన, హవనము, పూర్ణాహుతి, అభిషేకము, షోడశోపచార పూజ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ చేపట్టారు.

వినియోగంలో లేని డంప్‌యార్డు


చండూర్ గ్రామ శివారులో పడేసిన చెత్త

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ గ్రామంలో డంప్‌యార్డు నిర్మించినప్పటికీ వినియోగంలో లేదు. గ్రామంలో నిత్యం పంచాయతీ ట్రాక్టర్‌తో గ్రామస్తుల ఇళ్ల నుంచి చెత్తను సేకరించి డంప్‌యార్డులో కాకుండా గ్రామ శివారులో పడేస్తున్నారు. అక్కడే డంప్ చేసిన చెత్త చెదారాలను కాలుస్తున్నారు. దీంతో ఆ పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయి. లక్షలు పెట్టి నిర్మించిన డంప్‌యార్డు ఉన్నా.. చెత్తను గ్రామ శివారులో పడేయడం ఎంతవరకు సమంజమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని పాలకవర్గ సభ్యులు పట్టించుకొని చర్యలు తీసుకోవాలన్నారు.

చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోండి


మామిడి తోటలో ఏర్పాటుచేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

హుస్నాబాద్: అనుమతి లేకుండా చెట్లను తొలగిస్తున్నారని మామిడి తోట యాజమాని లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పట్టణ శివారులోని పొట్లపల్లి రోడ్‌లో ఉన్న మామిడి తోటలో అనుమతి లేకుండా ఇప్పటికే రెండు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించారని, మళ్లీ మరొకటి ఏర్పాటుచేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపాడు. ట్రాన్స్‌ఫార్మర్లకు మామిడి కొమ్మలకు తగిలే ప్రమాదం ఉంది. పెరిగిన చెట్లను నరికివేస్తున్నారని చెప్పాడు.

చెరువులో పడి యువకుడి మృతి


శ్రీహరి(ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని అప్పాజిపల్లి గ్రామానికి చెందిన కుర్మ శ్రీహరి(25) అనే యువకుడు చెరువులో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాగా యువకుడు ఈ నెల 30న జరగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద కనిపించాడని, తర్వాత నుంచి అదృశ్యమయ్యాడన్నారు. దీంతో వారు తెలిసిన వారి ఇళ్లతో పాటు బంధువుల వద్ద వెతికిన ఫలితం లేకపోయింది. శనివారం గ్రామ శివారులోని గండి చెరువులో శ్రీహరి మృతదేహం కనిపించింది. మృతుడి పెద్దనాన్న కుర్మ నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

కౌంటింగ్‌కు సిద్ధమైన నాయకులు

నర్సాపూర్: ఆయా పార్టీల అభ్యర్థులు ఆదివారం జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఓట్లు లెక్కించేందుకు ఎన్నికల కమిషన్ నిర్ణయించిన నేపథ్యంలో లెక్కింపులో పాల్గొనేందుకు వారు సిద్ధమవుతున్నారు. నర్సాపూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి, బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్‌లతో పాటు ఇతర అభ్యర్థులు తమ తరపున ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనేందుకు ఏజెంట్లను ఎంపిక చేశారు. కాగా నియోజకవర్గంలో 305 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఓట్లను లెక్కించేందుకు ఎన్నికల కమిషన్ అధికారులు ఒక రౌండ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేయనున్నందున 22 రౌండ్లలో నియోజకవర్గ ఓట్ల లెక్కింపు పూర్తి కాగలదు. కాగా పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించేందుకు సైతం ఒక టేబుల్ ఏర్పాటు చేస్తారు. పోస్టల్ బ్యాలెట్‌ను ముందుగా లెక్కించిన అనంతరం ఈవీఎంల్లో ఉన్న ఓట్లను లెక్కిస్తారని అధికారులు తెలిపారు. కాగా ఒక టేబుల్ వద్ద ఒక్కో అభ్యర్థి తరఫున ఒక ఏజెంటు ఉండి ఓట్ల లెక్కింపునకు అవకాశం కల్పించారు. దీంతో పాటు ఓట్లలెక్కింపు ప్రక్రియ మొత్తాన్ని పరిశీలించేందుకు ఒక అభ్యర్థి తరఫున ఒక చీఫ్ కౌంటింగ్ ఏజెంట్ సైతం ఉంటారని తెలిసింది. కాగా ఓట్ల లెక్కింపును క్షుణ్ణంగా పరిశీలించే వ్యక్తులను ఆయా పార్టీల అభ్యర్థులు ఎంపిక చేసుకొని ఓట్ల లెక్కింపు కేంద్రంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అభ్యర్థులు వారికి వివరించినట్లు తెలిసింది.

ఫలితం దక్కేనా?

బెజ్జంకి(సిద్దిపేట): ఓటర్లను చైతన్య పరిచేందుకు బీఎస్పీ మానకొండూర్ అభ్యర్థి, ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిశాని రామచంద్రం చేసిన ప్రయత్నం ఏమేరకు ఫలితాన్నిస్తుందో రేపటి ఫలితాలు నిర్ణయించనున్నాయి. మానకొండూర్ నియోజకవర్గంలోని ఆరు మండలాలలో పర్యటించిన ఆయన పలుసభల్లో మాట్లాడారు. పేదల బతుకులు మారడానికి ఓటుతో పాటు నోటు అందించి బీఎస్పీని ఆదరించాలని కోరారు. ఇలా సేకరించిన 1200 నోట్లు లెక్కించగా రూ.56 వేలు వచ్చినట్లు తెలిపారు. పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం స్ఫూర్తితోనే ఇలా నియోజకవర్గ ప్రజల నుంచి సేకరించి వారిని చైతన్యపరిచినట్లు రామచంద్రం తెలిపారు. ప్రధాన పార్టీలు ప్రలోభాలకు గురిచేస్తే తాము నోట్లు సేకరించామని పేర్కొనడం విశేషం.

వేగంగా అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి పనులు


రహదారిపై కొనసాగుతున్న బ్రిడ్జి పనులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని జప్తిశివనూర్ గ్రామ బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనులు వేగవంతం చేశారు. రెండేళ్ల క్రితం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే జప్తిశివనూర్ గ్రామస్తులు గ్రామంలోకి వచ్చేందుకు అవసరమైన సర్వీస్ రోడ్ లేకపోవడంతో అనేక మంది ప్రమాదాలకు గురయ్యారు. దీంతో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, జాతీయ రహదారి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల విజ్ఞప్తితో నిధులు మంజూరు చేసిన అధికారులు పనులు ప్రారంభించారు. అధికారులు పనులను మరింత వేగవంతం చేసి అండర్‌గ్రౌడ్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయాలని ప్రయాణికులు కోరారు.

కొండపోచమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం


పూజ చేస్తున్న అర్చకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ ఆలయ 22వ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. అమ్మవారిని పూలతో అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, అభిషేకం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈఓ మోహన్‌రెడ్డి, సర్పంచ్ రజిత, ఎంపీటీసీ కావ్యదర్గయ్య, సిబ్బంది రమేష్, కనకయ్య, వెంకట్‌రెడ్డి, సుధాకర్, హరి, చిన్నా, చందు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే గ్రామం అభివృద్ధి


మాట్లాడుతున్న సదాశివరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): అందరూ ఐకమత్యంగా ఉంటే గ్రామం అభివృద్ధి చెందడంతో పాటు దాతలు సహాయం చేసేందుకు ముందుకువస్తారని ఎల్లంకి ఇంజనీరింగ్ సంస్థల చైర్మన్ సదాశివరెడ్డి అన్నారు. పాలమాకుల గ్రామానికి చెందిన ఎల్లంకి మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు సదాశివరెడ్డి, సాంబశివరెడ్డి, దయాకర్‌రెడ్డి శనివారం రూ.10 లక్షల విలువ చేసే వైకుంఠ రథం, బాడీ ఫ్రీజర్ అందజేశారు. అనంతరం సదాశివరెడ్డి మాట్లాడుతూ పుట్టిన ఊరికి సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సారయ్య, సర్పంచ్ కుమారస్వామి, ఎల్లంకి రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఓజాలు, పరమేశ్వర్, వేణుచక్రవర్తి, ఐలయ్య, శ్రీనివాస్, నరేశ్, లక్ష్మణ్, అశోక్, రవి, మల్లేశం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన


స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని వివేకానంద పాఠశాలలో శనివారం ఘనంగా స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా చరణ్, కరస్పాండెంట్‌గా చందన, ప్రిన్సిపాల్‌గా ధనశ్రీ, మిగతా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, కరెస్పాండెంట్ లిఖిత పర్యవేక్షించారు. స్వయం పాలన నిర్వహించిన విద్యార్థులను ఉపాధ్యాయులు వాణిశ్రీ, రత్నమాల, జరీనా, శిరీష, శ్రీవాణి, మనూష, అరుణ, భారతి అభినందించారు.